ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ



ద్వారకాతిరుమల: అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు మాత్రలు వేస్తున్న దృశ్యం



పోలవరం: ఎల్‌ఎన్‌డీపేట పీహెచ్‌సీ పరిధిలో మాత్రలు వేస్తున్న దృశ్యం



కొయ్యలగూడెం: సీతంపేటలో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా ద్వారకాతిరుమలలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు వైద్య ఆరోగ్య సిబ్బంది సోమవారం నులి పురుగుల నివారణ మాత్రలను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌ఎన్ ఎస్.లక్ష్మి మాట్లాడుతూ నులి పురుగులు సోకిన పిల్లలు, కిషోర బాలలు రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గడం వంటి ఏదో ఒక సమస్యకి గురవుతారన్నారు. డివార్మింగ్ టాబ్లెట్‌లు వేసుకోవడం వల్ల నులి పురుగుల సమస్య తొలగి, చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. చిన్నతనం నుంచే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ అనీల్ బాబు, ఏఎస్‌ఎంలు మోహిని దుర్గ, రమాదేవి, జీఎంఎస్‌కేలు లక్ష్మి సుజన, మల్లీశ్వరి, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

2,374 మందికి ఆల్బెండజోల్ మాత్రలు

పోలవరం రూరల్: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పోలవరం మండలం ఎల్‌ఎన్‌డీపేట పీహెచ్‌సీ పరిధిలో 2,374 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు వైద్యాధికారి కె.నిఖిల్ తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని ఆరు హెల్త్‌లెవల్ సెంటర్స్‌లో 3 నుంచి 19 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలకు భోజనం తరువాత మాత్రలు మింగించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: విద్యార్థులకు నులిపురుగుల పంపిణీ కార్యక్రమం సీతంపేటలో సోమవారం నిర్వహించారు. బయ్యన్నగూడెం పీహెచ్‌సీ ఐక్య అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీసీ బాలికల సంక్షేమ పాఠశాల విద్యార్థినులచే పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సత్యనారాయణ నులిపురుగుల నివారణకు అల్బెండాజోలు మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి

నులిపురుగుల నివారణతో రుగ్మతలు దూరం



బుట్టాయగూడెం: రాజానగరంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న పీఓ

బుట్టాయగూడెం: నులి పురుగులను నివారిస్తే మనం తినే ఆహారంలోని పోషకాలను శరీరం గ్రహిస్తుందని తద్వారా రక్తహీనతను నివారించవచ్చని ఐటీడీఏ పీఓ కె. రాములు నాయక్ అన్నారు. రాజానగరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన నులిపురుగు నివారణ మాత్రలను విద్యార్థులతో మింగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 19 సంవత్సరాల లోపు వారికి నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పేగుల్లో నులిపురుగుల వల్ల ఎదుగుదల మందగించడం, నీరసం, రక్తహీనత, చదువుల్లో ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలతో బాధపడతారని అన్నారు. నులిపురుగుల మాత్రలు మింగడం వల్ల ఆ సమస్యలు తీరి పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జాతర మహోత్సవాలను జయప్రదం చేయాలి



దుద్దుకూరులో జాతర పోస్టర్‌లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు, తదితరులు

బుట్టాయగూడెం: ఈ నెల 12వ తేదీ నుంచి కామవరం సమీపంలో ఉన్న కనకదుర్గమ్మ తల్లి, గుబ్బల మంగమ్మతల్లి, నాగదుర్గాదేవి, గద్దెరాజుల జాతర మహోత్సవాలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కోరారు. మండలంలోని దుద్దుకూరులో సోమవారం సాయంత్రం జాతరకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా తెల్లం బాలరాజు మాట్లాడుతూ ఈ జాతర పూర్తిగా ఆదివాసీ గిరిజన సంస్కృతి, సంప్రదాయ పద్ధతిలో జరుగుతాయని అన్నారు. గిరిజన పూజారి వర్సా పుల్లారావు ఆధ్వర్యంలో విశేషమైన పూజా కార్యక్రమాలు చేయడంతోపాటు గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ బోనాలతో వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జాతరను జయప్రదం చేయాలని ఆయన కోరారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరేటి సత్యనారాయణ, న్యాయవాది ఏసుబాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు కోర్సా రాంబాబు, తెల్లం రమేష్, గోగుల రవి, మొడియం రమేష్, పి.తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో 'ప్రకృతి' పంట



ప్రకృతి వ్యవసాయంలో పండిస్తున్న కూరగాయలు, ఆకు కూరలను విక్రయిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలను ప్రజలకు అందుబాటులో ఉంచే విధంగా కృషి చేస్తున్నామని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి కె.కుమార వర్మ తెలిపారు. స్థానిక శివాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ శాఖ ద్వారా మండలంలో 30 మంది సిబ్బంది ప్రకృతి వ్యవసాయ శాఖలో పనిచేస్తున్నారని తెలిపారు. వారందరూ కూడా 50 సెంట్ల భూమిలో వంగ, మిరప, తోటకూర, చుక్కకూర, పాలకూర, బీర, ఆనప, ముల్లంగి, కేరట్‌లు, 20 సెంట్లలో తీగజాతి మొక్కలు భూమిలో సేంద్రియ ఎరువులు వాడి పండిస్తున్నట్లు చెప్పారు. సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో కేఆర్ పురం ఐటీడీఏ వద్ద, బుట్టాయగుడెంలో స్టాల్స్ ఏర్పాటు చేసి కూరగాయలు, ఆకు కూరలు విక్రయిస్తున్నామని చెప్పారు. ప్రతి సోమవారం స్టాల్స్ ఏర్పాటు చేసి సేంద్రియ పద్ధతిలో పండించిన ఆరోగ్యవంతమైన కూరగాయలు, ఆకుకూరలను ప్రజలకు విక్రయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రోడ్డు పనులు.. హడలెత్తిస్తున్న ప్రమాదాలు



బైక్ ఢీకొన్న ఘటనలో దెబ్బతిన్న కారు ముందు భాగం

కుక్కునూరు: కుక్కునూరు మండలంలోని ఆర్‌అండ్‌బీ రహదారిపై రోడ్డు ప్రమాదాలు పరిపాటిగా మారాయి. ఆదివారం కుక్కునూరుకు చెందిన వ్యాపారి కారు ప్రమాదానికి గురికాగా సోమవారం అదే గ్రామంలో రోడ్డు సరిగా లేని కారణంగా కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. గడిచిన రెండు నెలల్లో అసంపూర్తిగా నిలిచిన రోడ్డు పనుల కారణంగా పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి. అయినప్పటికీ అధికారులు రోడ్డు నిర్మాణ పనులపై కనీసం దృష్టి పెట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు ఇవ్వలేని స్థితిలో ఉన్నప్పుడు హడావిడిగా రోడ్డు మొత్తం తవ్వించాల్సిన అవసరం ఏమి వచ్చిందని మండల ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాక ఇకనైనా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి

విద్యార్థులకు డీటీసీ షేక్ కరీమ్ సూచన



అవగాహన కార్యక్రమం అనంతరం ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న రవాణా శాఖ అధికారులు, విద్యార్థులు

ద్వారకాతిరుమల: విద్యార్థి దశ నుంచే రహదారి భద్రత నియమాలపై అవగాహన పెంచుకుంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎం.నాగులపల్లి పంచాయతీ పరిధిలోని ద్వారకానగర్‌లో ఉన్న డీపాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ కరీమ్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం నేరమని, అలాగే రహదారి నిబంధనలు పాటించకపోవడం వల్ల వాహన చోదకులతో పాటు ఇతరుల ప్రాణాలకు సైతం ప్రమాదమన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి, హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి డ్రైవింగ్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు ఆయన వివరించారు. రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, మద్యపానం చేసి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. అదేవిధంగా సమారిటన్ లా గురించి విద్యార్థులకు వివరించారు. రహదారి ప్రమాదానికి గురైనవారిని రక్షించేందుకు మొదటి 60 నిమిషాల సమయం ఎంతో విలువైందని, దీనినే గోల్డెన్ హవర్‌గా పిలుస్తారన్నారు. ఆ సమయంలో బాధితులను ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించే కార్యక్రమం చేపట్టటం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు ఎస్.జగదీష్, అజ్మీరా బద్దు, కళ్యాణి, నరేంద్ర బాబు, పాఠశాల యజమాన్యం, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, పాల్గొన్నారు.

పట్టెన్నపాలెం వంతెన నిర్మించాలి



పట్టెన్నపాలెం బ్రిడ్జిని నిర్మించాలని ఆందోళన చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

జంగారెడ్డిగూడెం: పట్టెన్నపాలెం వద్ద జల్లేరు వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టెన్నపాలెంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కె.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధాన మార్గాల్లో ఈ రహదారి ఒకటన్నారు. జల్లేరు వాగు ఉద్ధృతి కారణంగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో వాగు ఉద్ధృతికి ఇప్పటివరకు సుమారు 24 మంది మృత్యువాత పడ్డారన్నారు. వంతెన నిర్మాణం 20 ఏళ్ల క్రితం ప్రారంభమైనప్పటికీ నేటికి పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వాలు సరైన చొరవ చూపకపోవడంతో వంతెన నిర్మాణం పూర్తి కాక ఈ ప్రాంతవాసులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఇదే రహదారి మీదుగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రాంతాలకు సైతం ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా బడ్జెట్‌లో పట్టెన్నపాలెం వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించి పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో జోడే సూర్యచంద్రం, సంకురు, కేవీపీఎస్ నాయకులు, దళిత, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు మన్యం బంద్

48 గంటలపాటు బంద్‌కు పిలుపునిచ్చిన గిరిజన సంఘాల నాయకులు



సింగన్నపల్లిలో బంద్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు

బుట్టాయగూడెం: అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టంపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివాసీ గిరిజన సంఘాలు 48 గంటలపాటు బంద్‌కు పిలుపునిచ్చాయి. దీనిలో భాగంగా మంగళ, బుధవారాలు రెండు రోజులపాటు బంద్ జరగనుంది. ఇప్పటికే బంద్‌ను పూర్తి విజయవంతం చేసేందుకు ఆయా సంఘాల నాయకులు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. బంద్‌కు సహకరించాలని వ్యాపారులందరికీ విజ్ఞప్తి చేశారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వాహనాల రాకపోకలు నిలిచిపోనున్నాయి. బంద్‌ను పూర్తి విజయవంతం చేసేందుకు ఆయా సంఘాల నాయకులు మండలాల్లో పూర్తి ఏర్పాట్లు చేశారు. బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం సాయంత్రం జేఏసీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు, ఏఐకేఎంఎస్ నాయకులు కారం రాఘవ, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షులు బన్నే బుచ్చిరాజు, సర్పంచ్‌లు కుంజా వెంకటేశ్వరరావు, ఉయికే బొజ్జి, రవ్వా నాగు, సోదెం ముక్కయ్య, తదితరుల ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. అలాగే సీపీఎం నాయకులు తెల్లం రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలో ద్విచక్ర వాహనాల ర్యాలీ చేసి బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దొంతా కృష్ణ

చింతలపూడి: గ్రామ సభలు నిర్వహించి భూయజమాని ప్రమేయం లేకుండానే వాస్తవ సాగుదారులను గుర్తించి వారికి కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతా కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని ఈనెల 12వ తేదీన మండల స్థాయిలో జరిగే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చింతలపూడి సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు గుర్తింపు కార్డు పొందిన వారికి ఆర్‌బీఐ రూల్స్‌ను అనుసరించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రెండు లక్షల వరకు హామీలేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తాడిగడప మాణిక్యాలరావు, సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య తదితరులు ఉన్నారు.

వీరభద్ర స్వామివారికి వెండి ఆభరణాలు సిద్ధం



స్వామి వారి అలంకరణకు సిద్ధం చేసిన వెండి ఆభరణాలు

కామవరపుకోట: ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు కోటలో కొలువై యున్న శ్రీ వీరభద్ర స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా స్వామి వారి అలంకరణకు దాతలు అందజేసిన వెండి ఆభరణాలను సిద్ధం చేశారు. స్వామి వారి శంకు, చక్రం, భద్రకాళి అమ్మవారి చీర, పంచ హారతులు, గొడుగు వంటి వాటిని సోమవారం మెరుగుపరిచి సిద్ధం చేసినట్లు ఆలయ ధర్మకర్త కొండూరు శ్రీధర్ తెలిపారు. ఉత్సవాలు, పండుగ సమయాల్లోనూ ఈ వెండి ఆభరణాలు స్వామివారికి అలంకరిస్తారని ఆయన తెలిపారు.

ప్రతి రైతూ విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలి

లింగపాలెం: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్ కార్డు తరహాలో రైతులకు అందించడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి కోటగిరి మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సొంత భూమి ఉన్న ప్రతి రైతు 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదు కొరకు ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందే పథకాలు, రాయితీలు, పెట్టుబడి, ఎరువుల రాయితీలు, పంటల బీమా, పంటలకు కనీస మద్దతు ధర, పంటల రుణాలు, వివిధ రకాల వ్యవసాయ అనుబంధ రంగాల సేవల కొరకు విశిష్ట సంఖ్య తప్పనిసరి అని పేర్కొన్నారు. సొంత భూమి గల రైతులు మీ గ్రామం వద్ద రైతు సేవా కేంద్రం నందు కావలసిన పత్రాలతో రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు.

ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దు

దెందులూరు: ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దని ఏలూరు పీఠం వికార్ జనరల్ సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ ఫాదర్ పి.బాల అన్నారు. సోమవారం సోమవరప్పాడు సెయింట్ జాన్స్ విద్యా సంస్థల్లో యాంటీ ర్యాగింగ్ డే సమావేశం అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ భూతం జోలికి వెళితే భవిష్యత్తు కోల్పోవడమే కాకుండా ఆ కుటుంబ సైతం సమాజంలో అవమానాలకు గురవుతుందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినా, సహకరించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రం అందజేత

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన రామనాథం ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచారి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

పొగమంచు సోయగం.. ఆదమరిస్తే ప్రమాదం



కొయ్యలగూడెంలోని జాతీయ ప్రధాన రహదారిపై అలముకున్న పొగ మంచు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం పరిసర ప్రాంతాలలో సోమవారం పొగ మంచు ధారాళంగా కురిసింది. జాతీయ ప్రధాన రహదారిపై పొగ మంచు పరుచుకోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉండడంతో వాహనదారులు వాహనాల లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు. ఉదయం 8 గంటల వరకు పొగ మంచు వీడలేదు.

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ సభ్యులతో ఎస్సై చెన్నారావు

కామవరపుకోట: ఈ నెల 11 నుంచి 19 వరకు స్థానిక కోటలో ఉన్న శ్రీ వీరభద్ర స్వామి కల్యాణ మహోత్సవాలకు వచ్చే భక్తులు జాగ్రత్త వహించాలని తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. సోమవారం ఉత్సవాలు జరిగే ఆలయ ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా సదుపాయాలు కల్పించాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. ఉత్సవాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించబడుతున్నాయని, భక్తులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విశ్వకర్మ యోజన కిట్ల పంపిణీ



లబ్ధిదారులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: చేతి వృత్తిదారులకు విశ్వకర్మ యోజన పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని తపన ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఆరేటి ఏసుబాబు పేర్కొన్నారు. సోమవారం బయ్యన్నగూడెం గ్రామంలో పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం ద్వారా విశ్వబ్రాహ్మణులకు 15 రోజులు శిక్షణ ఇచ్చి, స్టైఫండ్ రూ.15 వేలతోపాటు కిట్లు, సర్టిఫికెట్లు, విలువగల సామాగ్రిని అందించారు. మొదటి విడతగా 8 మందికి కిట్లు పంపిణీ చేసినట్లు ఏసుబాబు తెలిపారు. కార్యక్రమలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బాలం నరేష్, ఆరేటి ఏసుబాబు, కటిక రాధాకృష్ణ, రామారావు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించండి



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కుక్కునూరు: ఈనెల 27వ తేదీన జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కమల్ కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రజా సంఘాలు సంయుక్త సమావేశం సుందరయ్య భవనం ప్రజా సంఘాలు కార్యాలయంలో సుజాత అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి నాగేంద్రరావు, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బానారి బాలకృష్ణ, సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు షేక్ వలిపాషా, సహాయ కార్యదర్శి కాకర్ల శ్రీను, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు కాసిం బి తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదు మేరకు వేధింపుల కేసు నమోదైంది. ఏఎస్సై వై.మంగయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం మండలం చల్లవారిగూడెంకు చెందిన రత్నమాళికకు, కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడుకు చెందిన దాసరోజు జ్ఞానేశ్వరరావుతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే జ్ఞానేశ్వరరావు మద్యం సేవించి వచ్చి మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడని, దీనికి అత్తగారు దాసరోజు విజయలక్ష్మి కూడా సహకరిస్తోందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. గత 5 నెలల క్రితం కొట్టి, పిల్లలతో సహా తనను బయటకు గెంటి వేశారని, దీంతో తాను పుట్టింటిలో ఉంటున్నట్లు ఆమె ఫిర్యాదులో తెలిపింది. ఇంటికి వస్తే తనను, తన పిల్లలను చంపుతానని బెదిరిస్తున్నారని, రక్షణ కల్పించాలని కోరుతూ రత్నమాళిక ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయండి

పోలవరం రూరల్: ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్న మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని ఏజెన్సీ గిరిజన సంఘ గౌరవాధ్యక్షుడు ఇళ్ల రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి కుంజం రామారావు పిలుపునిచ్చారు. 1/70 రెగ్యులేషన్ రద్దుచేయకుండా ఉండటమే కాకుండా, పీసా చట్టం, అటవీహక్కుల రక్షణ చట్టం 2005 వంటి అన్ని ఆదివాసీ రక్షణ హక్కుల చట్టాలను యథాప్రకారం అమలు చేయాలని కోరుతూ బంద్ పిలుపునివ్వడం జరిగిందన్నారు. 1/70 చట్టం రద్దుచేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. రాబోయే రోజుల్లో ఆదివాసీ హక్కులపై జరగబోయే మరిన్ని దాడులను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలని ఏజెన్సీ ప్రజానీకానికి, ప్రజాతంత్ర ఉద్యమశక్తులకు విన్నవిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బస్సుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్న ధర్మాజీగూడెం హోలీ ట్రినిటీ స్కూల్, అనన్య స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీఏస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు జీవన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్‌కు వినతిపత్రం అందజేశారు. పిల్లల ప్రాణాల పట్ల బాధ్యత లేకుండా బస్సుల్లో ఓవర్ లోడ్ చేసి నడుపుతున్నారని తెలిపారు. కొన్ని బస్సులకు పర్మిషన్లు లేవని, మరికొన్ని బస్సులకు ఎఫ్‌సీలు కూడా డేట్ అయిపోయాయని వివరించారు.